క్లుప్తంగా...

కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా నోమా సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 6.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మల్లాపూర్ విద్యుత్ ఏఈ క్రిష్టయ్య తెలిపారు. 11 కేవీ నర్సింహనగర్ ఫీడర్ పరిధిలో నర్సింహనగర్ కాలనీ ఎన్టీఆర్ నగర్, మీర్‌పేట్, అన్నపూర్ణ కాలనీ, లక్ష్మీనగర్, సాయిబాబా గార్డెన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

11కేవీ లక్ష్మినగర్ ఫీడర్ పరిధిలో..

బీరప్పగడ్డ, మల్లాపూర్ ఓల్డ్ విలేజ్, మాప్లవర్ హైట్స్, మైప్లవర్ ప్లాటినమ్, మైప్లవర్ గ్రాండ్, 11 కేవీ ఆశోక్‌నగర్ ఫీడర్ పరిధిలో మర్రిగూడ, నెహ్రూనగర్, కేబుల్ చౌరస్తా, అశోక్‌నగర్‌కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం



నోట్‌బుక్స్ అందజేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తూ అండగా ఉంటామని 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి అన్నారు. భీంరెడ్డినగర్‌లోని ముగ్గురు పేద విద్యార్థులకు ఆయన నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలతో పాటు వారికి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు.

కిక్ బాక్సింగ్‌లో స్వర్ణం సాధించిన మల్లెల హర్ష



హర్షను అభినందిస్తున్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన మల్లెల హర్ష మంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించారు. ఝార్ఖండ్‌లోని రాంచీలో జరగబోయే జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలంగాణ కిక్ బాక్సింగ్ టీం కోచ్, మేడ్చల్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రాజు వెల్లడించారు. శనివారం మంత్రి చామకూర మల్లారెడ్డి, బోడుప్పల్ 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి హర్షను అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గెలుపొందేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

బస్తీ దవాఖానా సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనాలు పెంచాలి



కాప్రా: రాష్ట్రంలోని బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు కనీస వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ అన్నారు. ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో శనివారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బస్తీ దవాఖానా సపోర్టింగ్ స్టాఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బస్తీ దవాఖానాల్లో నిత్యం విధులు నిర్వహిస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్న ఎలాంటి జీవోలను అమలు చేయడం లేదని, శ్రీమిత్ర ఏజెన్సీ వారు కార్మికులకు ప్రతినెలా జీతాలు ఇవ్వకుండా నాలుగు నెలలకు ఒకసారి జీతాలు ఇస్తున్నారని, అందులో కొన్ని నెలలు జీతాలు ఇవ్వకుండా ఎగవేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుమన్, నర్సింహ, ఉప్పలయ్య, అంజాద్, శాంతమ్మ, పావని, భావిక, కవిత, అనిత, శ్రీలత పాల్గొన్నారు.

మోటార్‌తో నీటి పంపింగ్



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని ఎస్ఎండీసీ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేంకుమార్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి వాటర్ ఓవర్ ఫ్లో అవడంతో రోడ్డుపైకి వచ్చిందన్నారు. దీంతో మోటర్‌తో పంపింగ్ చేశారు. జలమండలి మేనేజర్ వేణుగోపాల్ నాయుడు, కాలనీవాసులు ఓరుగంటి రమేష్, భాస్కర్, కిషోర్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- అన్ని రాష్ట్రాల్లో అందించాలనేదే బీఆర్ఎస్ లక్ష్యం
- వివిధ రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు ప్రజల బ్రహ్మరథం
- మేడ్చల్‌లో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయం
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన తెలంగాణ మోడల్ కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఎదురుచూస్తున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మారుతి గార్డెన్‌లో నిర్వహించిన నాగారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి–సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, రైతు బీమా, రైతుబంధు, వ్యవసాయానికి ఉచిత కరెంటు, దళితబంధు ఇలా అనేక పథకాలను అమలు చేస్తున్న కేసీఆర్ త్వరలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ పథకాలను ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారన్నారు. ఇందు కోసం కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు అక్కడి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. తెలంగాణలో 60లక్షల మెంబర్‌షిప్ ఉన్న బీఆర్ఎస్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలో బీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున ప్రజలు, నేతలు చేరుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను చూసి బీజేపీ, కాంగ్రెస్‌లు ఓర్వలేకపోతున్నాయన్నారు. ప్రధాన మంత్రి మోదీ, బీజేపీ నేతలు మాటలకే పరిమితం అయ్యారని, ప్రజలకు మేలుచేసే పనులు చేపట్టడం లేదని విమర్శించారు. పబ్లిక్ సెక్టార్లను అమ్మి దేశ సంపదను ఆదానికి బీజేపీ ప్రభుత్వం దోచిపెడుతోందని విమర్శించారు.

కేంద్రం పంటనష్టం ఎందుకివ్వలేదు..?

పేద ప్రజలకు, రైతులకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దమ్ముంటే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ గతంలో పదేళ్లు పాలించి ప్రజలకు ఏమి చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో పంట నష్టం కింద రైతులకు రూ.10 వేలు అందజేస్తున్నామని, బీజేపీ కేంద్ర మంత్రి, ఎంపీలు రైతులకు కేంద్రం నుంచి పంట నష్టం ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు చెప్పాలన్నారు. మనకు కేసీఆర్‌లాంటి సీఎం ఉండటం అదృష్టమని, రానున్న ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ సత్తాచాటుతుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలకు స్పందన లభిస్తుందన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే విధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేయాలన్నారు.

అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు

ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించే విధంగా ముందుకు సాగాలన్నారు. నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇక్కడి ముస్లింలకు ఈద్గా కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామన్నారు. అదేవిధంగా అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, స్థలం ఉన్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలో త్వరలో 1100 మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమంలో దూసుకుపోతున్న మేడ్చల్ నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ'సర్వే' మాయ!

- వాస్తవ పరిస్థితికి భిన్నంగా నివేదికలు
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యం
- తప్పుల తడకగా ల్యాండ్ సర్వే విభాగం నివేదికలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: భూ సర్వే సిబ్బంది మాయాజాలంతో విలువైన భూముల లెక్కలు తారుమారు కావడం విస్మయానికి గురిచేస్తోంది. ఒక ప్రాంతంలోని ఒక స్థలాన్ని వేర్వేరుగా ఇద్దరు సిబ్బంది సర్వే చేసి భూకొలతలపై భిన్నంగా నివేదికలు అందజేయడం అనుమానాలకు తావిస్తోంది. కొందరికి ప్రయోజనం చేకూర్చేలా, మరి కొందరికి నష్టం కలిగించేలా చేతివాటం ప్రదర్శించడం ఆందోళన గురిచేస్తోంది. భూసర్వే కొలతల అక్రమాలపై ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తున్నా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరు నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్న చందంగా తయారైంది. భూసర్వే కొలతల వ్యవహారంలో భారీగా చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఒక అధికారి నిర్లక్ష్యం, అసమర్థత కారణంగానే భూసర్వే వ్యవహారంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- వివాదాస్పద భూములకు సైతం క్లీన్ చీట్ ఇవ్వడం.. మరోవైపు కొలతల రిపోర్టునకు భారీగా వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.
- అల్వాల్ మండలంలోని యాప్రాల్ ప్రాంతంలో 198 సర్వే నంబరులో 2015లో ఒకసారి, 2017లో మరోసారి భూసర్వే చేసినా అప్పటి మండల సర్వే సిబ్బంది 10 గుంటల స్థలం ఉందని పేర్కొంటూ సర్వే నివేదిక అందజేశారు. అదే స్థలాన్ని తాజాగా 2023 మార్చిలో 30 గుంటల స్థలంగా పేర్కొంటూ కొలతల నివేదిక సమర్పించడం అనుమానాలు కలిగిస్తోంది. ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారినట్లు తెలుస్తోంది.
- దుండిగల్ రూరల్ పరిధిలోని గాగిలాపూర్ 214 సర్వే నంబర్ సంగారెడ్డి– మేడ్చల్ జిల్లాల పరిధిలో ఉంటుంది. ఇక్కడ రెండు ఎకరాల స్థలాన్ని తప్పుడు కొలతలతో ఏకంగా హద్దులు మార్చివేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే కుదిరిన ఒప్పందంలో భాగంగా కొంత మాత్రమే ముట్టడంతో నివేదిక సమర్పించడంలో కాలయాపన సాగుతున్నట్లు తెలుస్తోంది.
- ఉప్పల్ మాజీ ప్రజాప్రతినిధి నాగోల్ విలేజి సమీపంలో సర్వే నంబర్ 124లోని ఓ ప్లాట్ విషయంలో నివేదిక ఇవ్వాలని భూసర్వే ల్యాండ్ విభాగంలో సంప్రదించగా, భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. రూ.2 లక్షలు ముట్టజెప్పినా.. మరింత ఇస్తేనే లైన్ క్లియర్ చేస్తానని చెప్పడంతో సదరు మాజీ ప్రజాప్రతినిధి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.
- దుండిగల్ మండలంలోని సాయినాథ్ సొసైటీలో స్థలాల వివాదం కోర్టులో ఉన్నప్పటికీ కొన్ని స్థలాలకు పట్టా పాస్ పుస్తకాలు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది.

మురళీధర్‌రావు సేవలు మరువలేనివి



మురళీధర్‌రావుకు నివాళులర్పిస్తున్న గవర్నర్ దత్తాత్రేయ

రామంతాపూర్: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ తండ్రి దివంగత మురళీధర్‌రావు దశదినకర్మ సంతాప కార్యక్రమంలో శనివారం హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రొఫెసర్‌గా సాంకేతిక విద్యను బోధించడం ద్వారా వేలాది మంది విద్యార్థులను ఇంజినీరింగ్ నిపుణులుగా తీర్చిదిద్దిన మురళీధర్‌రావు సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ సతీమణి శైలజ, కార్పొరేటర్ శ్రీవాణి వెంకటరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొరిగే కృష్ణ, మాజీ కౌన్సిలర్లు జలంధర్, శ్రీనివాస్‌చారి, బీజేపీ నేతలు బాలకృష్ణ, లక్ష్మణ్, బాలచందర్, జగన్ యాదవ్, జగదీష్, వెంకట్‌రెడ్డి, మంగమ్మ, నారాయణదాస్, కుమారస్వామి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాగ్రత్తలు పాటించాలి



కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చిన్న చర్లపల్లి – రాంపల్లి రోడ్డులో జరుగుతున్న కల్వర్టు నిర్మాణం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులకు సూచించారు. శనివారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కల్వర్టు పనులను పరిశీలించారు. వర్షాకాలం మొదలు కావడానికి ముందే కల్వర్టు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే పని జరిగే చోట హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమలో ఏఈ స్వరూప, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ముత్యాలు, శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో ఉత్సాహం నింపే కార్యక్రమాలు భేష్



సీబీసీ శిబిరం ముగింపు వేడుకల్లో బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ ఇందిరానగర్‌లోని క్రీస్తు రక్షణసువార్త ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ బైబిల్ క్లబ్ (సీబీసీ) శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ సీనియన్ నేత బండారి లక్ష్మారెడ్డి ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. వేసవిలో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో సంతోషం నింపుతాయన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ఇలాంటి కార్యక్రమాలకు కావాల్సిన తోడ్పాటు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, సాయిజెనోఖర్, కాటార్ల భాస్కర్, దూసరి నవీన్‌గౌడ్, అబ్రహం, మనీష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్ భేష్



చిలుకానగర్ డివిజన్ చర్చిలో చిన్నారులతో కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

ఉప్పల్: కులమతాలకు అతీతంగా ఆత్మీయ సమ్మేళనాలు ఉండాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ మౌంట్ కారమెల్ బాప్టిస్ట్ చర్చ్ లవ్ ఇండియా ఆధ్వర్యంలో పాస్టర్ జేమ్స్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం, సమ్మర్ హాలిడే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్‌లను సైతం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, వివిధ చర్చిల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



అల్వాల్: పేకాట ఆడుతున్న 9 మందిని పోలీసులు అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివానగర్‌లో శనివారం పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.45 వేలను స్వాధీనం చేసుకొని అల్వాల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత శిబిరం

అల్వాల్: అల్వాల్‌లోని రెడ్డి ఎన్‌క్లేవ్ శ్రీనివాసనగర్ సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం ఉచిత చెవి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 5 సంవత్సరాల నుంచి 13 ఏళ్ల వయస్సు గల పిల్లలకు చెవికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలకు అపోలో ఆసుపత్రి సౌజన్యంతో ఉచితంగా చికిత్స అందజేస్తారని చెప్పారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



గౌతంనగర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ అన్నారు. జేసీఐ, ఎల్‌కే ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో భరత్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 300 మందికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులతో పాటు కాలనీ ప్రతినిధులు సంతోష్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, బాలనర్సింహ, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జోడో యాత్రకు స్పందన



అంబేద్కర్‌నగర్‌లో పాదయాత్ర చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ నిర్వహిస్తున్న హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శనివారం వినాయక్‌నగర్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్, శివనగనర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంటగ్యాస్ రూ.500లకే ఇస్తామన్నారు. 80 గజాల ఇంటి స్థలం ఉండే నిర్మాణానికి రూ.5 లక్షల వరకు రుణం ఇస్తామన్నారు. నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల వరకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌ముదిరాజ్, మీడియా కన్వీనర్ గుత్తి రాంచందర్, ఎఆర్.శ్రీనివాస్ యాదవ్, సాయికుమార్, దుర్గాసాయి, నరసింహగౌడ్, గిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

గౌతంనగర్: బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం మిర్జాల్‌గూడలోని బూత్ నంబర్ 70, 71లో శక్తికేంద్రం ఇన్‌చార్జి స్వర్ణలత ఆధ్వర్యంలో దీవార్ పే లిఖ్నా అభియాన్ కార్యాక్రమం నిర్వహించారు. వాసంశెట్టి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గోడలపై కమలం పువ్వు గుర్తును రూపొందించే కార్యక్రమాన్ని ప్రాంభించారు. డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, వెంకట్‌యాదవ్, మల్లారెడ్డి, బండారి రవి, రాజేష్, బాలసుబ్రహ్మణ్యం, బలరాంసాగర్, రాజేష్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

రామంతాపూర్: బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్ పోటీలను శనివారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తూ..

బీజేపీని గద్దెదింపాలి

అల్వాల్: దేశంలో మతం పేరిట పంచాయితీలు పెట్టి ప్రజల మనసులో విషం చిమ్ముతున్న బీజేపీని గద్దెదింపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్ అన్నారు. శనివారం యాప్రాల్‌లో నిర్వహించిన ఇంటింటికీ సీపీఐ పాదయాత్రకు ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో మతం, కులం పేర్లతో ప్రజల మధ్య విభజన తెచ్చి మరోసారి దేశంలో అధికారంలోకి వచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. సీపీఐ నాయకులు రొయ్యల కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్, లక్ష్మి, సహదేవ్, సల్మాన్‌బేగ్, టి.యాదయ్యగౌడ్, ప్రమీల, స్వరూప, మహాలక్ష్మి, మాధవి, పద్మ, వెంకటేష్, యాదగిరి, రాములు తదితరులు పాల్గొన్నారు.

వినతి

అల్వాల్: వెంకటాపురం డివిజన్‌లోని సుభాష్‌నగర్, మారుతినగర్, వెస్ట్ వెంకటాపురం, భూదేవినగర్, శివనగర్, రాజీవ్‌గాంధీనగర్, ఇంద్రానగర్, కానాజీగూడ తదితర ప్రాంతాల్లో త్రీఫేజ్ కరెంట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్ శనివారం ఎలక్ట్రికల్ డీఈ సుశీంద్రనాథ్, ఏడీ రామాచారిని కలిసి వినతి పత్రం అందజేశారు.

సామాజిక కార్యక్రమాలు అభినందనీయం



సీఐటీయూ ఆధ్వర్యంలో చర్లపల్లిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

కుషాయిగూడ: కార్మికుల సమస్యలపై పోరాటాలతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న సీఐటీయూ తీరు అభినందనీయమని గండూరి ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రహమతుల్లా అన్నారు. మేడే వారోత్సవం సందర్భంగా శనివారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయనతో పాటు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు భూపాల్, చంద్రశేఖర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఎంఎస్‌రావు, నరసింహ, వెంకటేష్, మణికంఠ, ఆదాం, సురేష్, సోమచారి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక సంబురం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యరత్న రమణి సిద్ధి ఆధ్వర్యంలో నెలనెలా కళారాధన కార్యక్రమంలో ఇందిరా పరాంకుశం శిష్య బృందం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి మైమరపించింది. పలు అంశాలను సాహితీ భరద్వాజ్, శ్రీహిత, దర్శిని, శ్రియ చార్వి, యజ్ఞశ్రీ గీతికా తదితరులు మెప్పించారు.